క్లుప్తంగా

ఖాళీ బిందెలతో నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కాసిపేట: మండలంలోని లంబాడితండా(కె) గ్రామపంచాయతీలో నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామస్తులు మిషన్ భగీరథ ట్యాంకు వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని, ఉన్న బోర్లు సైతం చెడిపోవడంతో గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందన్నారు. గ్రామపంచాయతీలో పలుమార్లు చెప్పినా, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో తరచూ నీటి సమస్య ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

పనులు ప్రారంభం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని 31వార్డు కాంటా చౌరస్తా ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత భూమిపూజ చేశారు. పనులు నాణ్యతతో నిర్మించాలని సూచించారు. 30వార్డు ఎస్సీ కమ్యూనిటీ హాల్లో యోగా శిక్షణ శిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్, కమిషనర్ సమ్మయ్య, ఏఈ సందీప్, మున్సిపల్ కౌన్సిలర్లు సుకేషిణి భరద్వాజ్, రాజలింగు, ఆస్మాషేక్, శ్రీనివాస్, రాముసాయక్, సురేష్, రమేష్, అశోక్, కో ఆప్షన్‌సభ్యుడు వెంకటేష్, మాజీ వైస్ చైర్మన్ బీజీ శంకర్‌సింగ్, మాజీ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు



భీమారం: మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

చెన్నూర్‌రూరల్/వేమనపల్లి/భీమారం: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైంది. వేమనపల్లి, భీమారం మండల కేంద్రాల్లో నిర్వహించిన ప్రజావాణికి ఒక్కో దరఖాస్తు రాగా, చెన్నూర్ మండలంలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. అధికారులు మాట్లాడుతూ ప్రజావాణిని ప్రజ లు సద్వినియోగం చేసుకోవాలని సూ చించారు. ఆయా కార్యక్రమాల్లో చెన్నూర్‌లో ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఐకేపీ ఏపీఎం ప్రమీల, వేమనపల్లిలో ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు, ఏపీఓ సత్యప్రసాద్, ఈసీ మధు, ఏపీఎం ఉమారాణి భీమారంలో ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో సోమవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం(టీఎన్జీఓస్) ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధక శా ఖ కార్యాలయంలోని 15మంది ఉద్యోగ సిబ్బందికి టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి చేతుల మీదుగా సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ పట్టణ అధ్యక్షుడు నాగుల గోపాల్, పశుసంవర్ధక శాఖ కార్యాలయ సిబ్బంది తిరుపతి, గంగారాం, సుధాకర్, జహీర్‌భాషా, గణపతిరావు, అంజలి, విజయలక్ష్మి, మనోజ్, సాదిక్, అఖిల్, గోవర్దన్, లక్ష్మి పాల్గొన్నారు.

కొండంపేటలో కార్డన్ సెర్చ్

కోటపల్లి: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేపడుతున్నట్లు సీఐ విద్యాసాగర్ అన్నారు. కొండంపేట గ్రామంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించి 23ద్విచక్ర వాహనాలతో పాటు 2ఆటోలు సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. స్పెషల్ పార్టీ, టీఎస్‌పీఎస్సీ పోలీసులతో ప్రాణహిత సరిహద్దు ప్రాంతాలతో పాటు మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లోని కల్వర్టులను తనిఖీ చేసినట్లు తెలిపారు. గ్రామంలో ప్రస్తుత పరిస్థితులను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల భద్రత.. పోలీసుల బాధ్యత అని అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు సురేశ్, సుబ్బారావు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ విపత్తు





నా పేరు సత్తన్న. మాది కవ్వాల్. నేను నాలుగు ఎకరాలు పొలం వేశాను. వానలకు పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నీళ్లలో పడింది. పది ఐదు రోజులైతంది. విషయం కరెంటోళ్లకు చెప్పాను. ఇప్పటివరకు రాలేదు. ట్రాలీలో వేసుకుని లక్సెట్టిపేట రమ్మంటున్నరు. ఎలాగోలా వేసుకుని పోతాను. వేరే ట్రాన్స్‌ఫార్మర్ అయినా తొందరగా అమర్చాలి.

వర్షాలు, వరదల కారణంగా విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పలు గ్రామాల్లో, గోదావరి తీరాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి రైతులకు ఇబ్బందికరంగా మారింది. సకాలంలో మరమ్మతు చేయలేని పరిస్థితి ఏర్పడటం వల్ల వ్యవసాయ పనులకు తిప్పలు తప్పడం లేదు.

వరదలకు నేలకొరిగిన స్తంభాలు | గ్రామాలకు నిలిచిన సరఫరా | వరినాట్ల సమయంలో రైతులకు తిప్పలు | విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం

జన్నారం: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు కవ్వాల్, ధర్మారం, కలమడుగు, బాదంపల్లి, రోటిగూడ, తపాలపూర్ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కవ్వాల్‌లో ట్రాన్స్‌ఫార్మర్, ధర్మారంలో 9స్తంభాలు, కలమడుగులో 15స్తంభాలు, బాదంపల్లిలో 7స్తంభాలు, రోటిగూడలో 12స్తంభాలు, తపాలపూర్‌లో 3స్తంభాలు వరదదాటికి పడిపోయినట్లు విద్యుత్ అధికారులు అంచనా వేశారు. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలోని అత్యధిక గ్రామాలు విద్యుత్ మోటార్ల కింద వరిపంట వేసుకుంటున్నారు. నాటు వేసే సమయం ఉన్నందునా రైతులందరూ, విద్యుత్ మోటార్లు వాడుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సమయంలో స్తంభాలు అస్తవ్యస్తంగా పడి ఉండి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటం వల్ల రైతులకు ఇబ్బంది తప్పడం లేదు.

స్పందించని విద్యుత్ అధికారులు..

రైతుకు వెన్నుదన్నుగా నిలిచి, పంట పండించడంలో చేదోడు, వాదోడుగా నిలవాల్సిన విద్యుత్ సిబ్బంది నుంచి స్పందన కరువైందని రైతులు వాపోతున్నారు. విద్యుత్ అధికారుల తీరుపై నిరసనగా నెలరోజుల క్రితం ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకోకు దిగారు. పది రోజుల క్రితం చర్లపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు విద్యుత్ సరఫరాపై అడిగితే ఏఈ నిర్లక్ష్యంగా మాట్లాడారని కవ్వాల్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఇలాంటి సంఘటనలు జేఎల్‌ఎం, లైన్‌మెన్‌ల నుంచి అధికంగా ఎదురవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఏదైనా ఆశ చూపితే తప్పా, ట్రాన్స్‌ఫార్మర్ మార్పులో, స్తంభాలు అమర్చడంలో సిబ్బంది ఆసక్తి చూపడం లేదని రైతుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో అధికారులు స్పందించి, రైతులకు విద్యుత్ సిబ్బంది సహకారమందించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోతలు లేకుండా చూడాలి



విద్యుత్ మోటార్లతో వరి పంటలు వేసుకుంటున్నాం. పొలం కై లి చేపించినం. వర్షాల నీటితోనే కయిల్ అయింది. ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి కరెంట్ ఇస్తలేరు. పొలాలు నాటు వేసుకునే సమయంలో కరెంటు లేకపోతే ఇబ్బంది అవుతది. అధికారులు స్పందించి కోతలు లేకుండా చూడాలి.

– రంగు వెంకటేశ్, కవ్వాల్

పనులు చేపడుతున్నాం

మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వరదలకు పడిపోయాయి, వాటిని అంచనా వేసి పునరుద్ధరణ పనులు ప్రారంభించాం. రైతులకు విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తాం. కవ్వాల్ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయింది. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను లక్సెట్టిపేట తీసుకెళ్లి, కొత్తది తీసుకురావాల్సి ఉంది. ట్రాలీ మాట్లాడుకుని ట్రాన్స్‌ఫార్మర్ తీసుకు రావాలని రైతులకు చెప్పాం.

– లచ్చయ్య, ఏఈ, జన్నారం

గురుకులాల్లో గొప్ప స్నేహితులు కోకొల్లలు



మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి: గొప్ప స్నేహితున్ని కలిగి ఉండటం అదృష్టంగా భావించాలని, అలాంటి గొప్ప స్నేహితులు గురుకులాల్లో కోకొల్లలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాలలో సోమవారం జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సైదులు, మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ కె.రాజ్‌కుమార్, జేవీపీ రాజేశ్వర్, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, శ్రీరామవర్మ, రమేష్, అర్జున్, రవి, ఉపాధ్యాయులు ప్రమోద్‌కుమార్ గౌడ్, దత్తప్రసాద్, కౌసర్, శ్రీనివాస్, రమాదేవి, అజిత, హారిక, ప్రవంతి, రాకేష్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు పూదరి నగేష్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



చెన్నూర్: పట్టణంలోని టౌన్-1 ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9:30గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. టౌన్ వన్‌లో శ్రీనగర్ కాలనీ, అంబేద్కర్, కొత్తగూడెం, విశ్వకర్మ, ఓల్డ్ సినిమా టాకీస్, మంగళిబజార్, బట్టిగూడెం, ఎమ్మెల్యే కాలనీలు, గాంధీచౌక్, చెరువు కట్ట ఏరియా జెండవాడ, గ్రంథాలయం, హాస్పిటల్, రాజీవ్‌రోడ్డు, జగన్నాథాలయం, మార్కెట్, చాకలివాడ, పుప్పాలహనుమాన్‌చ, బడా హనుమాన్, కు మ్మరిబొగుడ, మారెమ్మవాడ, కొటంవాడ, గో దావరిరోడ్డు, బొక్కలగూడెం, బెస్తవాడ, బ్రాహ్మణవాడలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

లక్సెట్టిపేట తహసీల్దార్‌గా విజయనందన్



లక్సెట్టిపేట: మండల నూతన తహసీల్దార్‌గా విజయనందన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన జ్యోత్స్న ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లగా కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన విజయనందన్ ఇక్కడికి వచ్చారు. స్థానిక సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

భీమిని తహసీల్దార్‌గా సాయిబాబు



భీమిని: మండల తహసీల్దార్‌గా సోమవారం బింగి సాయిబాబు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సాయిబాబు మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్, వైద్య అధికారులు

చెన్నూర్: పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని 5, 13వార్డుల్లో సీజనల్ వ్యాధులు, ప్రత్యేక పారిశుధ్యంపై వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వ్యాధుల వివరాలు తెలుసుకుంటూ, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కాలనీల్లో బ్లీచింగ్‌పౌడర్, హైపోక్లోరైడ్‌ను పిచికారీ చేశారు. నీరు నిలిచి ఉన్న చోట దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్ వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 31నుంచి 9వ తేదీ వరకు రోజుకు రెండు వార్డుల చొప్పున అవగాహన ర్యాలీలు, పారిశుధ్య పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో జగదీశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్ నసీమా బేగం, బీఆర్‌ఎస్ నాయకులు, వైద్య, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సీఈఆర్ క్లబ్‌లో మెగా వైద్యశిబిరం



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఓదెలు

మందమర్రిరూరల్: పట్టణంలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఈఎస్‌సీ హెల్త్ కేర్ తెలంగాణ భవనాలు, ఇతర నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ బోర్డ్ ఆధ్వర్యంలో సోమవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుతో కలిసి హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్మాణరంగ కార్మికులను ఆదుకుంటుందన్నారు. వారికి హెల్త్‌కార్డులు అందించి ప్రత్యేకమైన స్కీంల ద్వారా వారి ఆరోగ్య సంరక్షణ చూసుకుంటుందని తెలిపారు. వైద్య శిబిరంలో 280మంది కార్మికులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, వారి రిపోర్ట్‌లు కరీంనగర్‌లోని ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు. వైద్యశిబిరం మూడు రోజులు నిర్వహించనున్నట్లు కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు అమూల్య, వైద్యబృందం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

వేమనపల్లి: ఫైలేరియా వ్యాపించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని వైద్యాధికారి రాజేష్, ఎంపీడీఓ లక్ష్మయ్య తెలిపారు. మండల స్థాయి ఎంబీఎం కార్యక్రమంపై సోమవారం టాస్క్‌ఫోర్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆగస్టు 10వ తేదీ నుంచి పది రోజులు మండల స్థాయిలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మూడు రకాల మందులు అందించనున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు సోకకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీఓ బాపురావు, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలు, కార్యదర్శులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ అనీష్

బెల్లంపల్లి: బోదకాలు వ్యాధి నిర్మూళనకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల పీహెచ్‌సీ వైద్యుడు అనీష్, ఎంపీడీవో రాజేందర్ కోరారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ బోధకాలు వ్యాధి నిర్మూళనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 10వ తేదీ నుంచి 25వ తేదీ వరకు వ్యాధి నిర్మూళన కోసం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్లనే వ్యాధి వ్యాప్తి నివారణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి, ఏపీఎం శ్యామల, ఎంపీవో శ్రీనివాస్, హెచ్‌ఈవో సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పక్కన పెట్టిన పాలకవర్గం

- వరదలపై చర్చ లేకుండానే మున్సిపల్ సమావేశం




మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజయ్య

మంచిర్యాలటౌన్: మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాన్ని అతలాకుతలం చేసిన వరదలతో ఎన్టీఆర్‌నగర్, రాంనగర్, పద్మశాలీ కాలనీలు వరదల్లో మునిగిపోగా, వరదకు సంబంధించిన ఎలాంటి అంశాలను చర్చించకుండానే సమావేశాన్ని ముగించారు. వందలాది ఇళ్లు వరద నీటిలో మునిగి, పలువురు నష్టపోయారు. మూడేళ్లుగా పట్టణాన్ని వరద ముంచెత్తుతున్నా, నివారణకు కనీస చర్యలను మున్సిపల్ పాలకవర్గం తీసుకోకపోవడం, సమావేశంలో రూపొందించిన ఎజెండాను చదివి, వెంటనే సమావేశాన్ని ముగించడంపై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వరదల్లో నష్టపోయిన వారికి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వడంలేదని, వరద బాధితులు గగ్గోలు పెడుతున్నా, వారి ఆవేదనను పట్టించుకోకపోవడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ రావుల ఉప్పలయ్య, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్లు వేములపల్లి సంజీవ్, మాజిద్ అన్నారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని గోదావరి ఒడ్డున నిర్మించి నిధులు వృథా చేశారని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఆర్అండ్‌బీ ఆవరణలో ఎంసీహెచ్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు అవసరానికి మించి ఉన్నారని ఉన్నతాధికారులు గతంలోనే చెప్పినా, అదనంగా 30మంది కార్మికులను తీసుకుని, వారికి వేతనాల రూపంలో రూ.13.50లక్షలను చెల్లించి, మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అత్యవసర పనుల నిర్వహణకు రూ.లక్షల్లో నిధులను ప్రతి నెలా ఖర్చు చేస్తున్నా, ఆయా పనులను చేపట్టకుండానే, చేపట్టినా పనులకు సైతం అధికంగా బిల్లులను పెడుతుండడం వల్లనే మున్సిపల్ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చ లేకుండానే ముగిస్తున్నట్లుగా తెలుస్తోంది.

14 అంశాల ఆమోదం..

పట్టణంలోని వివిధ వార్డుల్లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.28.44 లక్షలతో చేపట్టే పనులకు ఆమోదం తెలుపగా, మున్సిపల్ చట్టప్రకారం మున్సిపల్ బడ్జెట్‌లో 10శాతం బడ్జెట్‌ను పచ్చదనం, నర్సరీలు, మొక్కలను నాటేందుకు కేటాయించడం కోసం రూ.20లక్షలను కేటాయిస్తూ ఆమోదించారు. చెత్తకుప్పలు, పారిశుధ్యం కోసం అదనం 30మంది కార్మికులను తీసుకుని, మూడు నెలల కోసం వారికి వేతనాలు రూ.13.50 లక్షల మంజూరుకు ఆమోదిస్తూ మొత్తంగా 14అంశాలపై ఆమోదిస్తూ సమావేశాన్ని ముగించారు.


సాదాసీదాగా లక్సెట్టిపేట మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కాంతయ్య

లక్సెట్టిపేట: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మాణాలను సభ ఆమోదం తెలిపింది. పలు వీధుల్లో గుంతలు పూడ్చేందుకు మొరం, స్టోన్ డస్ట్ పోయాలని నిర్ణయించారు. పారిశుధ్య నిర్వాహణకు, స్వచ్ఛ ఆటోల మరమ్మతుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇప్పటి వరకు నిర్వహించిన పనులు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులు చర్చించారు. వర్షకాలం కావడంతో వీధుల్లో ప్రజలకు ఎటువంటి అత్యవసరం వచ్చినా, వెంటనే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఇదివరకు విధులు నిర్వర్తించిన కమిషనర్ ఆకుల వెంకటేష్ బదిలీపై వెళ్లగా ఆయనకు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. మేనేజర్ రాజశేఖర్‌కు బాధ్యతలు అప్పజెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, వార్డు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నస్పూర్ మున్సిపల్ సమావేశం



పాల్గొన్న చైర్మన్, కమిషనర్

నస్పూర్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎజెండాలో పొందుపరిచిన 25అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించి, ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ రమే శ్, ఆర్ఓ సతీష్, ఏఈ మధు, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరణ

లక్సెట్టిపేట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. ప్రకాశం జిల్లా అద్దంకిలో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్న విఠల్‌బాబును కొంతమంది దుండగులు హత్యచేయడం దారుణమన్నారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చి రక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, న్యాయవాదులు రాజేశ్వర్, రాజేశ్వర్‌రావు, భూమారెడ్డి, శ్రీధర్, సత్యనారాయణ, సురేందర్, కిరణ్‌కుమార్, రవీందర్, నళినికాంత్, పద్మ, తిరుపతిస్వామి, శఫీక్, ప్రదీప్, రవి, ప్రకాశం, గణేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డీఏఓ పుష్పలతకు వినతిపత్రం ఇస్తూ...

బెల్లంపల్లి: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాటికొండ శ్రీధర్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సోమవారం దశలవారీ పోరాటంలో భాగంగా తపస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి, డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి(డీఏఓ) పుష్పలతకు వినతి పత్రం అందజేశారు. వెంటనే సమస్యలపై దృష్టిసారించాలని, లేకపోతే ఈ నెల 10వ తేదీన జిల్లా కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో తపస్‌రాష్ట్ర అకాడమిక్ కో కన్వీనర్ విద్యాసాగర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎనగందుల రమాదేవి, భారతి, నాయకులు మాటూరి ప్రసాద్, అన్నపూర్ణ, అంకం రమేష్‌కుమార్, ఆత్రం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కోటపల్లి: మండలకేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం మంచిర్యాల కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎంపీపీ మంత్రి సురేఖా వినతిపత్రం అందజేశారు.

రైతులను ఆదుకోవాలి

జన్నారం: వరదల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు నంది రామయ్య డిమాండ్ చేశారు.

పంటల పరిశీలన

కోటపల్లి: మండలంలో వర్షాలకు రాంపూర్, రావులపల్లి, కొల్లూర్, దేవులవాడ గ్రామాల్లో నీట మునిగిన పత్తి పంటలను ఏవో మహేందర్ సందర్శించి పంట నష్టానికి సంబంధించి వివరాలను సేకరించారు.

పారిశుధ్య కార్మికులకు మద్దతు

లక్సెట్టిపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీబంధు అని చెబుతు ప్రజలను మోసం చేస్తుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముల్కల్ల మల్లారెడ్డి అన్నారు. స్థానిక ఐబీ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అనంతరం పారిశుధ్య కార్మికులు చేపడుతున్న దీక్షకు మద్దతు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

పౌరహక్కుల దినోత్సవం

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ జీపీ పరిధిలోని దుబ్బగూడలో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ హన్మంతరావు, సీఐ కృష్ణా, ఎంపీడీవో మల్లేశం, ఎస్సై ప్రసాద్, పౌర హక్కులను గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

పోస్టర్ ఆవిష్కరణ

జన్నారం: గ్రామాలకు కొత్త వ్యక్తులు వస్తే వారి సమాచారం అందించాలని లక్సెట్టిపేట సీఐ కృష్ణ కోరారు. మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా వాంటెడ్ మావోయిస్టులకు సంబంధించిన పోస్టర్లను సోమవారం జన్నారం పోలీస్‌స్టేషన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జన్నారం ఎస్సై సతీశ్ పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా తిరుపతి

జైపూర్: మండల మేరు సంఘానికి సోమవారం ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా నౌనూరి తిరుపతి ఎన్నికయ్యారు.

సైబర్ నేరాలపై అవగాహన

నెన్నెల: సైబర్ నేరాలపై ప్రజలు, యువత, విద్యార్థులు అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని నెన్నెల ఎస్సై శ్యాం పటేల్ అన్నారు. సోమవారం నెన్నెలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

భీమిని: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ రాజేశ్వరి అధ్యక్షతన ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యులు ఎవరూ హాజరుకాకపోవడంతో కోరం లేదని సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సబ్దర్‌అలీ పేర్కొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత

రామకృష్ణాపూర్: పట్టణంలోని 3వ వార్డు ఇందిరానగర్‌కు చెందిన దివ్యాంగుడు రంగు అనిరుధ్‌కు జీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాజరమేష్ సోమవారం ట్రైసైకిల్‌ను అందచేశారు.